01ATP05F_01ATP05F.qxd 05-07-2024 PM 10:28 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 06 జూలై 2024 పేజీలు : 04

కల్తీ ఆహారాన్ని అరికట్టడమే తమ లక్ష్యం...!

- గతంలో 41 శ్యాంపుల్స్‌కు నెగిటివ్ రిపోర్టు
- 30 కేసుల్లో దాదాపు రూ.8లక్షల ఫైన్ వసూళ్లు
- గత ఎడాది ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు 580 శ్యాంపుల్స్ సేకరణ
- రిపోర్టు వచ్చిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటాము
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే చర్యలు తప్పవు
- ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ యస్.కళ్యాణ్ చక్రవర్తి

అనంతపురం న్యూటౌన్, జూలై 5 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కల్తీ ఆహారాన్ని అరికట్టడానికి ప్రత్యేక దృష్టి పెట్టామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ యస్.కళ్యాణ చక్రవర్తి తెలిపారు. శుక్రవారం ఆయన వార్తతో మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో కల్తీ ఆహారం తయారీ, విక్రయాలను అరికట్టడానికి ఇద్దరు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఓ)లు ఉన్నారని, ఒక్కొక్కరు నెలకు పది శ్యాంపిల్స్ సేకరిస్తున్నారన్నారు. అలాగే గత ఎడాది ఏప్రిల్ నెల నుండి ఈ ఏడాది జూన్ నెల వరకు 580 శ్యాంపుల్స్ సేకరించామన్నారు. ఈ శ్యాంపుల్స్‌ను హైదరాబాద్‌లోని నాచారం ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ల్యాబ్ నుంచి దాదాపు 20 రోజుల్లోనే మాకు రిపోర్టు వస్తుందన్నారు. గతంలో 41 కేసుల్లో నెగిటివ్ (కల్తీ ఆహారం నిర్ధారణ) రిపోర్టు వచ్చిందన్నారు. అందులో 11 కేసులు కోర్టులో జరుగుతున్నాయన్నారు. మిగిలిన 30 కేసులు జాయింట్ కలెక్టర్

అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలక్ యస్.కళ్యాణ చక్రవర్తి

కోర్టులో ఉండగా...వాటిని జెసి పరిశీలించి కల్తీ ఆహారం తయారు చేస్తున్న వ్యాపారులకు ఒక్కొక్కరికి ఒక్కో విధంగా దాదాపు రూ.8 లక్షలు ఫైల్ వేసి, వాటిని వసూళ్లు చేసి ప్రభుత్వానికి చెల్లించామన్నారు. ఆ విధంగా కల్తీ ఆహారంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. తమ స్వార్థం కోసం కల్తీ ఆహారం తయారు చేసి విక్రయాలు చేస్తే అలాంటి వ్యాపారులపై నిబంధనల ప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా కల్తీ ఆహారం తయారీ, విక్రయాలు జరుగుతుంటే అనంతపురం జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీమ సెల్ నెం:9502640082కు, శ్రీ సత్యసాయి జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామచంద్ర సెల్ నెం: 9703383684లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కల్తీ ఆహారం తయారీ, విక్రయాలను అరికట్టడమే తమ శాఖ మొదటి లక్ష్యమన్నారు.

ఫుడ్ వ్యాపారం చేసే వారంతా లైసెన్స్ తీసుకోవాల్సిందే :

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎవ్వరైనా ఫుడ్ వ్యాపారం చేస్తుంటే తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాల్సిందేనని ఉమ్మడి జిల్లా ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఒక ఎడాదికి రూ.12 లక్షల లోపు ఫుడ్ వ్యాపారం చేసే వారు రూ.100 రుపాయిలు, రూ.12 లక్షల నుండి రూ.2 కోట్లు వ్యాపారం చేసే వారు రూ.20 వేలు, ఫుడ్ మ్యాన్‌ప్యాక్చర్ చేసే వాప్యారులు రూ.3 వేల రుపాయిలను ఆన్‌లైన్‌లో చెల్లించి లైసెన్స్ ఖచ్చితంగా తీసుకోవాలన్నారు. లైసెన్స్‌ను ఒక ఎడాదికి లేదా ఐదు ఏళ్లకు ఒకే సారి లైసెన్స్ తీసుకోవచ్చునన్నారు. లైసెన్స్ లేకుండా ఫుడ్ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, జేపీ నడ్డాను కలిసిన సీయం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు వినతిపత్రం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర కేంద్ర మంత్రులు

- అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలని వినతులు

భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎన్డీఏ ఎంపీలతోపాటు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందించిన వారు త్వరలో ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యతనిస్తూ అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలని విన్నవించినట్లు సమాచారం.

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త

ఢిల్లీ పర్యటనలో భాగంగా రెండవ రోజు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసారు. కేంద్ర మంత్రులు కె.రాంమోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్,

కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో జరిగిన సమావేశంలో సీయం చంద్రబాబునాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు విరివిగా రుణాలు అందించండి

- సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ , లీడ్‌బ్యాంక్ అధికారులతోకలసి పొటెన్షియల్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీసత్యసాయిజిల్లా, జులై 05, ప్రభాతవార్త ప్రతినిధి:

స్టాండ్ అండ్, ఎంఎస్ఎంఇ పథకాల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు విరివిగా రుణాలు అందించాలని బ్యాంకర్లకు జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన డిఎల్ఆర్ రివ్యూ సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిశ్రమలు, వ్యవసాయం, డిఆర్‌డిఎ, మెప్మా తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను విరివిగా అందించాలన్నారు. నిర్లక్ష్యం వహించే బ్యాంకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ బ్యాకర్ల సమావేశం నిర్వహించడం జరుగుతుందనిత్వరలో సమగ్ర నివేదికలతో ఆయా సంక్షేమ శాఖలకు సంబంధించి అధికారులు ప్రణాళికలు తీసుకురావాలని ఆదేశించారు. ఏఏ మండలాల్లో ఎంత మంది లబ్ధిదారులు అర్హత సాధించారు? బ్యాంకుల వారీగా వివిధ కులాల వారీగా జాబితాలను సిద్ధంచే సుకోవాలన్నారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టియు 100 శాతం రుణాలు అందజేయాలని, కోళ్ళు, పొట్టేళ్ళు, పందుల పెంపకం యూనిట్లకు, ఎంఎస్ఎంఇ ద్వారా 150 కోట్ల రూపాయల రుణ సదుపాయం కల్పించడానికి ప్రభుత్వ ఆమోదం తెలిపిందన్నారు. జిల్లాలో 23 బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని, కెవిఐబి, పిఎంఇజిపి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి విరివిగా రుణాలు అందించాలన్నారు. నాబార్డ్ పథకాల పట్ల ప్రజలకు అవగాహనకల్పించాలని, జిల్లా పరిశ్రమల శాఖ క్రింద 49 మంది ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులు వివిధ బ్యాంకుల రుణాలు త్వరితగతిన అందించాలన్నారు. గోరంట్ల సమీపంలో త్వరలోనే ఆర్ఎస్ఇటిఐ కార్యాలయాన్ని ఏర్పాటుచేయడానికి స్థల సేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో పొటెన్షియల్ క్రెడిట్ ప్లాన్ అనే పుస్తకాన్ని సంయుక్త కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఐ బి.గిరిధర్, నాబార్డ్ డిడిఎం అనూరాధ, ఎల్‌డిఎం రమణకుమార్, ఏపిజిబి బ్యాంకు ప్రతినిధి రమేష్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పిడి నరసయ్య,మెప్మా పిడి విజయలక్ష్మి, సెరికల్చర్ జెడి పద్మావతి, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, జౌళి, చేనేత శాఖ అధికారి రమేష్‌బాబు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, నోడల్ అధికారి శివారెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, డిక్కీ, ఫిక్కీ సభ్యులు పాల్గొన్నారు.

కోనేర్లు, జలపాతాలు పరిశీలించిన కేంద్ర బృందం

-నీటి లభ్యత వినియోగంపై ఆరా తీసిన వాణిజ్య మంత్రిత్వశాఖ డైరెక్టర్ ఆర్.అరులానందన్

పెన్నహోబిళంలో కోనేర్లను పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి వాణిజ్య మంత్రిత్వశాఖ డైరెక్టర్ ఆర్.అరులానందన్, టెక్నికల్ ఆఫీసర్ యం.డి.షరీఫ్ బృందం

జలపాతాల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని పెన్నహోబిళంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి చెందిన కోనేర్లు, క్షేత్రం గుండా ప్రవహించే జలపాతాల ప్రదేశాన్ని శుక్రవారం జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ డైరెక్టర్ ఆర్.అరులనందన్, టెక్నికల్ డైరెక్టర్, సైంటిస్టు యం.డి.షరీఫ్ తదితరులతో కూడిన బందం కోనేర్లు, నీటి జలపాతాల ప్రదేశాన్ని పరిశీలించి నీటి లభ్యత వాటి వినియోగంపై ద్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బందితో ఆరా తీశారు. భూగర్భ జలాలను పెంచడానికి, రిజర్వాయర్ల స్థితిగతులు తెలుసుకొని వాటి ద్వారా సాగు, తాగునీటిని వినియోగించుకోవడంపై అధ్యయనం చేయడంలో భాగంగా కేంద్ర బృందం జిల్లాలో 3 రోజులపాటు పర్యటిస్తున్న విషయం తెలిసింది. ఇందులో భాగంగానే పెన్నహోబిళంలో పర్యటించిన అనంతరం వారు పీఏబీఆర్ డ్యాంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎంపీడీఓ సుబ్బరాజు, ఉపాధి హామీ ఏపీఓ విమల సిబ్బంది ఉన్నారు.

అనంతలో ఎయిర్‌పోర్టు నిర్మించండి

- కేంద్రమంత్రిని కోరిన ఎంపిలు

కేంద్రమంత్రికి వినతిపత్రం అందచేస్తున్న ఎంపిలు

హిందూపురం, జూలై 5 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలో విమానాశ్రయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడుకు రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి కేశవ్, అనంత ఉమ్మడి జిల్లాల ఎంపిలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారధి వినతిపత్రం అందచేశారు. ఈ మేరకు ఢిల్లీల్లో శుక్రవారం మంత్రిని కలిసి చర్చించారు. ఢిల్లీ నుండి హిందూపురం మీడియాకు లక్ష్మీనారాయణ వివరాలు వెల్లడించారు. జిల్లా ప్రజలకు ఎన్నికల హామీల్లో భాగంగా విమానాశ్రయం, ఉద్యానపంటల ఎగుమతికి అనుగుణంగా, ప్రయాణీకుల సౌకర్యార్థం, ఏవియేషన్ ట్రైనింగ్ కొరకు అనంతపురంలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయవలసిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచన మేరకు కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. కేంద్ర మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇది కార్యరూపం దాల్చినట్లు అయితే తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దక్షిణాదిలోనే మొట్టమొదటి ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతి కేంద్రంగా విమానాశ్రయంగా రాణిస్తుందని లక్ష్మీనారాయణ మీడియాకు తెలిపారు.

పోలీసులు క్రమశిక్షణతో మెలగాలి

- శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి

పరేడ్ మైదానంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి

పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతున్న దృశ్యం

పుట్టపర్తి, జులై 05, ప్రభాతవార్త

పోలీసులు అనుక్షణం అక్రమత్తంగా ఉండి ఎంతోక్రమశిక్షణతో మెలగాలని శ్రీసత్యసాయి జిల్లాఎస్‌పి ఎస్.వి.మాధవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పరేడ్‌మైదానంలో ఎఆర్‌సాయుధ బలగాలు, స్పెషల్ పర్టీ సిబ్బంది, హోంగార్డు సిబ్బంది, పుట్టపర్తి, అర్బన్; రూరల్‌స్టేషన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పరేడ్‌ను నిర్వహించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ, పరేడ్ అనేది క్రమశిక్షణకు నిదర్శనమని, విధి నిర్వహణలో నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటారని పరేడ్ కార్యక్రమం సిబ్బంది అందరినీ సమైక్యం చేస్తూ సమిష్టి విధి నిర్వహణకు తోడ్పడుతుందన్నారు. విధులు, ఇతర ఏ విషయంలో అయిన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసకురావాలని, సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం

గడచిన సార్వత్రిక ఎన్నికల్లో హోం గార్డుల సేవలు అద్భుతమని జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పరేడ్ మైదానంలో హోంగార్డులకుఅభినందన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. 298 మంది హోంగార్డులకు జిల్లా ఎస్‌పి చేతుల మీదుగా బహుమంతులు అందజేశారు.ముున్ముందుఇదేస్ఫూర్తిని కొనసాగించాలనిసమిష్టి కృషి వల్లే జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు.ప్రజలతో మమేకమై మర్యాదగా వ్యవహరించడంతో పాటు పోలీసుల పట్ల ప్రజలకు విశ్వాసం పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌డిఎస్‌పి విజయ్‌కుమార్, ఆర్ఐలు వలి, చంద్రశేఖర్, రవికుమార్, ఆర్ఎస్ఐలు, ఎఆర్‌సి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సవితమ్మకు ఘన సత్కారం

నల్లమాడ జూలై 05 ప్రభాతవార్త,

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళీశాఖ మంత్రి సవితమ్మను జిల్లా బీసీ సంక్షేమ శాఖ క్లాస్ ఫోర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పెనుగొండలో మంత్రి మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ కదిరి లక్ష్మీనరసింహాస్వామీ తీర్థ ప్రసాదాలను మంత్రి సవితమ్మకు అందజేశారు. జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చక్రధరయాదవ్,పురుషోత్తం, సాయి, ఎర్రిస్వామీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని సత్కరిస్తున్న సుధాకర్ →



ఆన్‌లైన్‌లో వ్యవసాయ సర్టిఫికేట్ కోర్సు

-కె.వి.కె ప్రధాన శాస్త్రవేత్త రాధాకుమారి

కళ్యాణదుర్గం, జూలై 5 ప్రభాతవార్త

అచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం అధ్వర్యంలో వ్యవసాయ రంగంలో దూరవిద్య ద్వారా అన్‌లైన్‌లో సర్టిఫికేట్ కోర్సును సెప్టెంబర్ నుండి రెండు నెలల పాటు నిర్వహిస్తున్నట్లు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాధాకుమారి,ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు వివరాలు పేర్కొంటూ ప్రధానంగా తేనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తులకు విలువల జోడింపు, పట్టుపురుగుల పెంపకం తదితర అంశాలపై అన్‌లైన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అసక్తిగల అభ్యర్థులు తమ పేర్లను ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్://ఎఎన్‌జిఆర్‌ఎయు.ఎసి.ఇన్ గాని డాక్టర్.కె.ఎస్.పూర్ణిమ, సహ అచార్యులు, సార్వత్రిక దూరవిద్యా కేంద్రం,లాంఫాం, గుంటూరు, సెల్ నెంబర్ : 8008788776 సంప్రతించాలని పేర్కొన్నారు.

డిఎస్‌సి ఉచిత కోచింగ్ అభ్యర్థులకు నోట్ పుస్తకాల కిట్లు పంపిణీ

కళ్యాణదుర్గం, జూలై 5 ప్రభాతవార్త

డిఎస్‌సి ఉచిత కోచింగ్ అభ్యర్థులకు నోట్ పుస్తకాల కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో డిఎస్‌సి పోటీ పరీక్షల ఉచిత కోచింగ్ తీసుకుంటున్న సుమారు 7వందల మంది అభ్యర్థులకు శుక్రవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మేనల్లుడు ధర్మతేజ్ అధ్వర్యంలో నోట్ పుస్తకాల కిట్లు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ధర్మతేజ్ మాట్లాడుతూ డిఎస్‌సి కోచింగ్ తీసుకుంటున్న అందరు అభ్యర్థులు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులు కావాలని, ఉద్యోగావకాశాలను అందుకోవాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రీరాములు, రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించిన ఈఓపిఆర్‌డి

బ్రహ్మసముద్రం జూలై 05 ప్రభాతవార్త,

డ్రైడే ఫ్రైడే కార్యక్రమం దృశ్యం

మండల కేంద్రంలో శుక్రవారం ఈఓపి ఆర్‌డి వెంకట్‌నాయుడు డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామ వీధుల్లో తిరిగి ఇంళ్ళముందు మురుగునీరు నిలిచిన ప్రదేశంలో బ్లీచింగ్ వేయించారు ప్రతి శుక్రవారం ప్రజలు ఇంటిలోని నిలువవున్న నీటిని పారవేసి ఎండలో ఎండబెట్టి నీటిని నింపుకోవాలని సూచించారు.ప్రతి ఇంటి పరిసరాలలో శుభ్రంచేసుకోవాలని అన్నారు.సచివాలయ సిబ్బంది ఏయన్‌యంలు గ్రామాలలో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని అన్నారు.అనంతరం ఎంపిడీఓ కార్యాలయంలో పంఛాయితీ కార్యదర్శులతో పంఛాయితీలలో సీజనల్‌వ్యాదులు ప్రజలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు ప్రతి ఒక్కరు గ్రామాలలో తాగునీరు కలుశితం కాకుండా చూడాలని అన్నారు.

విద్యార్థులకు పలకలు.. పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

శెట్టూరు, జూలై 5 ప్రభాతవార్త

విద్యార్థులకు పలకలు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మండలంలోని ములకలేడు పంచాయితీలోని అంబేద్కర్ నగర్‌లో పనిచేస్తున్నటువంటి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మురళీ, మరొకసారి తన సేవా గుణాన్ని ప్రదర్శించారు. ఇంతకు మునుపే పోటీ పరీక్షలకు తన విద్యార్థులను తీర్చి దిద్దడమే కాకుండా, విద్యార్థులకు దగ్గరుండి అన్ని విధాలా సహాయం చేసేవారు. ఉపాధ్యాయ సంఘాల మండల కార్యదర్శిగా పని చేస్తున్న ఈ ఉపాధ్యాయుడు నేడు తన ముద్దుల కూతురు పుట్టిన రోజు సందర్భంగా తాను పని చేస్తున్న పా ఠశాల విద్యార్థులకు ఏదైనా ఒక విధంగా సహాయ పడాలని ఆలోచన చేస్తూ తన పాటశాలలో విద్యార్థులందరికీ పలక, పరీక్షలకు ఉపయోగపడే ప్యాడ్స్‌ను అందరికీ అందజేసి మరొకసారి తను మానవతా వాడిని అనిపించుకున్నాడు. ఇతని సేవా గుణాన్ని చూసిన గ్రామస్తులు తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్‌లకు డిపార్మెంట్ మార్పు చేసి పదోన్నతి కల్పించాలి

- ఎమ్మెల్యేని కలిసిన డిజిటల్ అసిస్టెంట్లు...

కణేకల్లు, జూలై 05 ప్రభాతవార్త:

ఎమ్మెల్యేను కలవడానికి వెళుతున్న డిజిటల్ అసిస్టెంట్లు

డిజిటల్ అసిస్టెంట్‌లకు డిపార్మెంట్ మార్పు చేసి పదోన్నత కల్పించాలని రాయదుర్గం నియోజకవర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులని ఐదుఉ మండలాల డిజిటల్ అసిస్టెంట్లు కలిసి వినతిపత్రం అందించారు. పంచాయితీ సెక్రటరీ జిఆర్‌విఐ డిజిటల్ అసిస్టెంట్లకు ఉన్న టెక్నికల్ నాలెడ్జ్ మరియు వారికి ఉన్న స్కిల్స్ పరంగా విద్యా శాఖలో విలీనం చేయాలని, లేదా ప్రభుత్వంలోని వివిధ 35శాఖలలో జూనియర్ అసిస్టెంట్లుగా పోస్టులు ఇవ్వాలని, మెరుగైన ప్రమోషన్లు కల్పించాలన్నారు. రాయదుర్గం శాసన సభ్యులు కాలవ శ్రీనివాసులు సానుకూలంగా స్పందించి మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, కణేకల్లు మండలాల డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుంటుమారెమ్మకు ప్రత్యేక పూజలు

రాయదుర్గం రూరల్, జూలై 05 ప్రభాతవార్త:

పూజలు అందుకుంటున్న కుంటుమారెమ్మ అమ్మవారు

మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపాన రాయదుర్గం-బళ్లారి ప్రధాన రోడ్డుపై వెలసిన శ్రీ కుంటుమారెమ్మ అమ్మవారికి శుక్రవారం అమావాస్య సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే గంగపూజ, వస్త్రఅలంకరణ, పుష్పఅలంకరణ, ఆకుపూజ, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయంలో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుండి భక్తులు వచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

హత్యతో టిడిపికి సంబంధం లేదు

-ఆ సంస్కృతి వైసిపిదే

హిందూపురం, జూలై 5 ప్రభాతవార్త

మీడియాతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మండలంలోని గోళ్లాపురంలో వైసిపికి చెందిన సతీష్ హత్య సంఘటనకు తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్థానిక టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ అధ్యక్షులు రమేష్, మండల కన్వీనర్ అశ్వర్థరెడ్డి, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి జేవనహళ్లి ఆనంద్, తదితరులు మీడియాతో మాట్లాడారు. వ్యక్తిగత కక్షల కారణంగా ఆ హత్య జరిగిందని, అయితే ఘటనకు టిడిపి కారణమని చెప్పడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. హింస రాజకీయాలను ఎమ్మెల్యే బాలకృష్ణ ఎట్టి పరిస్థితిలోనూ హిందూపురం నియోజకవర్గంలో ప్రోత్సహించబోరని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వెంటనే స్పందించి హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. హత్యా రాజకీయాల సంస్కృతి వైసిపిదేనని చురకలు అంటించారు. ఆ పార్టీ నాయకుడు రామకృష్ణారెడ్డి హత్యకు అదే పార్టీకి చెందిన వారే కారణమన్న విషయం మరిచిపోయారా అన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్‌పిటిసి ఆదినారాయణ, సీనియర్ నాయకులు సంతేబిదనూరు శ్రీరాములు, హెచ్‌ఎన్ రాము, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి పిహెచ్‌సిలో ఆలయ చైర్మన్ రామానందన్ అన్నదానం

లేపాక్షి, జూలై 5 ప్రభాతవార్త

గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు హాజరైన దాదాపు 70 గర్భవతులు, బాలింతలకు శుక్రవారం లేపాక్షి ఆలయ చైర్మన్ రామానందన్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు వెంకటచిరంజీవి, రాజ్‌కుమార్‌లు గర్భవతులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తల్లి బిడ్డ క్షేమంగా వుండాలంటే డాక్టర్ల సూచనలను సలహాలను పాటించాలన్నారు. అనంతరం లేపాక్షి ఆలయ చైర్మన్ రామానందన్ మిత్రబృందం గర్భవతులు, బాలింతలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం...



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బుడగ జంగం సభ్యులు..

రాయదుర్గం, జూలై 05 ప్రభాతవార్త:

పట్టణంలోని బేడ బుడగ జంగం కుటుంబ సభ్యులు పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో శుక్రవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు నాగయ్య, బలగల్ల జమ్మన్నలు మాట్లాడుతూ మేము గత 40సంవత్సరాలుగా రాయదుర్గం పట్టణంలో జీవనం కొనసాగిస్తున్నామని, మాకు ఇంటి స్థలాలు లేవని పేర్కొన్నారు. మాకు ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. మా సమస్యలపట్ల ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంతో వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు మున్సిపాలిటి సాధారణ సమావేశం...

- ఎక్స్ ఆఫిషియో సభ్యునిగా ఎమ్మెల్యే కాలవ ప్రమాణ స్వీకారం...

రాయదుర్గం, జూలై 05 ప్రభాతవార్త:

మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఫైల్‌ఫోటో

నేడు(శనివారం)రాయదుర్గం పట్టణంలోని మున్సిపాలిటి సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంకు స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై ఎక్స్ అఫిషియో సభ్యునిగా ప్రమాణం చేస్తున్నారని ఆమె తెలిపారు. శనివారం ఉదయం 11.30గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కావున కౌన్సిలర్లు, అధికారులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యేతో కలిసిన వైసీపీ కౌన్సిలర్లు....

చర్చినీయాంశంగా మారిన మున్సిపల్ కౌన్సిలర్ల కలియిక....

శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులను రాయదుర్గం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో 16మంది వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యేను కలవడంతో ఈ అంశం పట్టణంలో చర్చనియాంశంగా మారింది. వీరు ప్రత్యక్షంగా తెలుగుదేశం పార్టీలో చేరుతారా..?, ప్రత్యేక వర్గంగా ఉంటారా.? అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా నేడు మున్సిపల్ సాధారణ సమావేశంకు ఈ సంఘటనతో ఓ ప్రత్యేక సంతరించుకుంది.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి....

రాయదుర్గం, జూలై 05 ప్రభాతవార్త:

మట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప...

వర్షాకాలం దృష్ట్యా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సూచించారు. శుక్రవారం పట్టణంలోని గౌడా లేఅవుట్‌లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో కమిటి సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ముఖ్యఅతిథిగా హాజరైయారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి వైద్యం అందేలా చూడాలని సూచించారు. అతిసార వ్యాధి ప్రబలకుంఆ ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇళ్లచుట్టుపక్కల శుభ్రతను మెరుగుపరుచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జిన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిడిఒ డాక్టర్ రమేష్, యుపిహెచ్‌సి డాక్టర్ అజార్‌ఖాన్, ఐసిడిఎస్ సిబ్బంది ఈశ్వరి, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరి మోహన్‌బాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠవాలలు నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు విద్యాధికారులు సూచనలు

ధర్మవరం రూరల్, జూలై 5 ప్రభాతవార్త

రాజేశ్వరి దేవి ఎంఈఓ-1,

గోపాల్ నాయక్ ఎంఈఓ-2

ప్రైవేట్ పాఠశాలలు కచ్చితమైన నిబంధనలు పాటించాలని మండల విద్యాధికారులు రాజేశ్వరిదేవి, గోపాల్‌నాయక్ అన్నారు. మండల విద్యాధికారి కార్యాలయంలో శుక్రవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతీ ప్రైవేట్ పాఠశాలలు తప్పనసిరిగా యాజమాన్య బోర్డు, గవర్నింగ్ బాడీని నియమించుకోవాలన్నారు. ఈ బోర్డు సభ్యులు తప్పనిసరిగా నెలవారి సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. అదే విధంగా విడిగా తల్లిదండ్రులతో ప్రతి నెలా తప్పనిసరిగా సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. భద్రతా ఆరోగ్య పరిశుభ్రతా కమిటీల ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలకు, ఇంటర్నెట్‌కు బానిసలు కాకుండా అవగాహన కల్పించాలన్నారు. మండల విద్యాధికారి కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి ప్రైవేట్ పాఠశాలలతో లాభింగ్ చేస్తున్నాడని ఆరోపణలు వస్తున్నాయని విషయం మండల విద్యాధికారి దృష్టికి పాత్రికేయులు తీసుకెళ్లగా అటువంటి ఏవైనా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు.

జిల్లాలో పర్యటించనున్న కేరళ హైకోర్టు జడ్జి

పుట్టపర్తి, జులై 05, ప్రభాతవార్త

కేరళ హైకోర్టు జడ్జి చెల్లూరు మంజుల దంపతులు రెండురోజుల పాటు శ్రీసత్యసాయిజిల్లాలో పర్యటించనున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. వారు ఈ నెల 7వ తేది ఉదయం 10 గంటలకు బెంగుళూరు నుండి రోడ్డు మార్గం గుండా బయలు దేరి మధ్యాహ్నం 01:30 గంటలకు కదిరి చేరుకుంటారని, అక్కడి ప్రభుత్వ అతిథి గృహంలో బస చేసి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవాలయాన్ని సందర్శిస్తారన్నారు. అలాగే 08వ తేది ఉదయం కూడా శ్రీలక్ష్మినరసింహస్వామి దేవాలయాన్ని సందర్శించి కదిరి నుండి బెంగుళూరుకు బయలుదేరి వెళ్ళనున్నట్లు తెలియజేశారు.

సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ పకడ్బందీగా పూర్తీ చేయండి

-వీఆర్‌ఓలతో సమావేశంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త

వీఆర్‌ఓలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా పూర్తీ చేయాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి సూచించారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వెరిఫికేషన్ 3 రోజుల్లో పూర్తీ చేయాలన్నారు. సచివాలయం, ఏపీ సేవా సర్వీసెస్ వెబ్‌ల్యాండ్ రెవిన్యూ పెండింగ్‌లో గుంతకల్లు రెవిన్యూ డివిజన్‌లోనే ఉరవకొండ మండలంలోనే అధికమన్నారు. ప్రభుత్వం గతంలో నిర్వహించిన కుల గణన ఆధారంగా ప్రభుత్వం దగ్గరున్న డేటా ఆధారంగా సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ చేయిస్తోందన్నారు. క్యాటగిరి-ఎ పరిధిలోని క్యాస్ట్ సర్టిఫికేట్ల జారీ కోసం కులాలు సక్రమమేనా లేదా అన్న విషయాలను వీఆర్‌ఓలు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ జరుపాలన్నారు. ఈ వెరిఫికేషన్ ఆధారంగా ఇకపై ఎవరికి క్యాస్ట్ సర్టిఫికేషన్ కావాలన్నా సచివాలయాలు, మండల రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా క్షణాల్లో సర్టిఫికేట్‌ను జారీ చేసే వీలుంటుందన్నారు. ఉరవకొండ మండలంలో తమ దగ్గరున్న డాటా మేరకు 8,372 మంది కులాలను వెరిఫికేషన్ చేయాల్సి ఉండగా ఎన్నికల ప్రక్రియ తదితరాల కారణంగా కేవలం 132 వెరిఫికేషన్ మాత్రమే జరిగిందన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ దస్తగిరయ్య, డిప్యూటీ తహశీల్దార్ హరినాథ్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ నరేష్‌కుమార్, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

పెన్నహోబిళ క్షేత్రంలో పారిశుద్ధ్య పనులు

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త

పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో పారిశుద్ధ్య పనులు శుక్రవారం షేక్షానుపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో కొనసాగాయి. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు, నెలపూజోత్సవం ముగిసిన క్రమంలో క్షేత్రంలో చెత్తాచెదారాన్ని తొలగించడానికిగాను ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో షేక్షానుపల్లి పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించారు. కోనేర్లు, నీటి జలపాతాలు, ఆలయ పరిసరాల్లో చెత్తా చెదారాన్ని తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మారుతి, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హంస ఉరవకొండ తాలుకా నూతన కార్యవర్గం ఎన్నిక

-తాలుకా అధ్యక్షుడుగా యం.ప్రసాద్‌రావు, కార్యదర్శిగా ఎన్.వెంకటేశులు

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ (ఏపీ హంస) ఉరవకొండ తాలుకా నూతన కార్యవర్గ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏపీ హంస జిల్లా కన్వీనర్ ఎస్.యండి.షఫీ ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల అధికారులైన జిల్లా కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, రాఘవేంద్రల సమక్షంలో ఎన్నుకున్నారు. ఉరవకొండ తాలుకా అధ్యక్షులుగా యం.ప్రసాద్‌రావు, అసోసియేట్ ప్రసిడెంట్‌గా నాగరంగయ్య, కార్యదర్శిగా నిమ్మల వెంకటేశులు, కోశాధికారిగా లలితమ్మ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సి.శ్రీనివాసులు, బి.రమేష్‌బాబు, డి.సుజాత, ఇ.అరుణ, గౌతమి, సహ కార్యదర్శులుగా ఎస్.నూర్‌మహమ్మద్, పి.వి.డి.భవాని, చంద్రకళ, లలిత, వరలక్ష్మి, కార్యనిర్వహక కార్యదర్శిగా మంజుల, ప్రచార కార్యదర్శిగా బి.జయరాజు, మహిళా కార్యదర్శిగా సుశీలబాయి, కార్యవర్గ సభ్యులుగా మాధవి, నాగమ్మ, మధు, సుమలత, లక్ష్మి, సంజీవ, నాగరాజు, శుభాషిణి, మాలాశ్రీలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ఎస్.యండి.షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయపరమైన హక్కుల సాధనకు సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ దృష్టికి తీసుకెళ్లి ఏపీ హంస కృషి చేస్తుందని తెలిపారు.

ఏపీ హంస ఉరవకొండ తాలుకా నూతన కార్యవర్గం దృశ్యం

డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి, జులై 05, ప్రభాతవార్త

బిసి, ఎస్‌సి,ఎస్‌టి కులాలకు చెందిన అభ్యర్థులు డిఎస్‌సి (ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్) పరీక్షల కొరకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెబనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్.నిర్మల జ్యోతి ఒక ప్రకటనలో తెలియజేశారు. మొత్తం 200 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, జులై నెల 7వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని జులై 11వ తేది నుండి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో 75% హాజరు ఉన్న వారికి స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతుందన్నారు. డిఎస్‌సి, టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ బయోడెటాతో పాటు టెట్ మార్కుల జాబితా, టిసి, డిగ్రీ మార్కులిస్టులు, కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు (తల్లిదండ్రుల ఆదాయం ఒక లక్షల రూపాయలలోపు మాత్రమే) ఉండాలని, ఆధార్ బ్యాంక్ పాసుపుస్తకం, 2 పాస్‌పోర్టు సైజ్ పోటోలు, జరతపరచి అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ బిసి స్టడీసర్కిల్, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం వద్ద, పెన్నార్‌భవన్ ప్రక్కన ఉన్న కార్యాలయం నందు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు నేరుగా బిసి స్టడీ సిర్కల్ అనంతపురం కార్యాలయంలో కానీ, ఫోన్ 08554 275575 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆమె కోరారు.

10వ తరగతిలో టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు

-చీకలగుర్కి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అందించిన రాజ్ ఫౌండేషన్

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్ ఫౌండేషన్ ప్రతినిధి

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త

10వ తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలచిన విడపనకల్లు మండలం చీకలగుర్కి జెడ్పీ ఉన్నత పాఠ శాలలో చదువుకున్న నలుగురు విద్యార్థు లకు రాజ్ ఫౌండేషన్ నగదు ప్రోత్సా హ కాలు (మెరిట్ స్కాలర్‌షిప్) అందించింది.

మెరిట్ స్కాలర్‌షిప్ అందుకున్న 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

శుక్రవారం పాఠశాలలో ప్రధానోపా ధ్యాయుడు రాఘవ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజ్ ఫౌండేషన్ ఛైర్మెన్ గోపాల్‌నాయుడు, వైస్ ఛైర్మెన్ రామకృష్ణనాయుడు, కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ పెద్ద విజేత పాల్గొని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బి.లిఖితకు మొదటి బహుమతిగా 7,000 రూపాయలు, ద్వితీయ బహుమతిగా 5,000 రూపాయలు, తృతీయ బహుమతిగా బి.చంద్ర, బి.లోకేష్‌లకు నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివి భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీజినల్ వ్యాధులు ప్రబలకుండా ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు

-డ్రై డేను దగ్గరుండి పర్యవేక్షించిన కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

నీటి తొట్టెలను పరిశీలిస్తున్న మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త

సీజినల్ వ్యాధులు ప్రబలకుండా మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలోని 11వ వార్డులో శుక్రవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగాయి. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ వార్డులో మురుగునీటి కాలువలను దగ్గరుండి శుభ్రం చేయించి దోమలు వ్యాప్తి చెందకుండా మిలాతిన్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. నీరు నిలబడిన ప్రదేశాల్లో అబేట్ ద్రావాణాన్ని చల్లించి డ్రైడేను పరిశీలించారు.

03ATP27_03ATP27.qxd 05-07-2024 PM 10:29 Page 1

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధం

- బాధితురాలికి రూ.5 లక్షల ఆస్తినష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు, స్థానికుల విజ్ఞప్తి
- పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.. ఆదుకుంటామని హామీ

మడకశిర టౌన్, జులై 5 ప్రభాతవార్త

విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో దగ్ధమైన షాపును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

షాక్ సర్క్యూట్ కారణంగా కిరాణా దుకాణం కాలి బూడిదైన ఘటన మడకశిర పట్టణంలోని సదాశివపురంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన సదాశివపురం 15వ వార్డు, నాగలక్ష్మి 20 ఏళ్లుగా పట్టణంలో కిరాణా దుకాణం నిర్వహిస్తోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటల 10 నిమిషాల ప్రాంతంలో మూసి ఉన్న షాపులో నుంచి పొగరావడంతో గమనించిన స్థానికులు షాపు నిర్వాహకురాలు మరిది కౌన్సిలర్ నరసింహరాజుకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న బాధితురాలి షాపు తెరిచి చూడగా షాపులోపల ఉన్న అన్ని సరుకులతో పాటు ఫ్రిడ్జ్, కౌంటర్ మొత్తం కాలి బూడిదైపోయాయి. ఈ ఘటన విద్యుత్ సర్క్యూట్‌తో జరిగిందా లేదా ఎవరైనా ఆమెకు గిట్టని వారు కిరాణా షాపుకు నిప్పు పెట్టారా..? అంటూ వార్డు ప్రజలు చర్చించుకుంటున్నారు. షాపులో ఉన్న రూ.2వేల నగదుతోపాటు కిరాణా సరుకులు అంతా, ఫ్రిడ్జ్ మొత్తం కాలిపోయి 5 లక్షల నష్టం వాటిల్లినట్టు వారు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగలక్ష్మి 20 ఏండ్లుగా కిరాణా షాపుతో జీవనోపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని షాపు మొత్తం కాలిపోవడంతో ఎలా బతకాలి అంటూ రోదించారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితురాలితోపాటు 15వ వార్డు ప్రజలు కోరారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లకు బాధజతురాలు నాగలక్ష్మి అర్జి కూడా అందజేశారు. బాధజతురాలు కిరాణా షాపు దగ్ధమైన విషయం తెలుసుకొన్న హుటాహుటిన చేరుకున్న రాష్ట్ర తేదేపా ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కిరాణ్యా కొట్టు విద్యుత్ షాక్‌తో దగ్ధమైందా, లేదా ఎవరైనా ఈమెకు గిట్టనివారు నిప్పు పెట్టారా అన్న విషయాలపై విచారించండి అంటూ పోలీసులకు సూచించారు. తహశీల్దారు వెంకటేశ్వర్లు ఆర్ఐ చంద్రశేఖర్ స్వామిలను వెంటనే పిలిపించి ప్రభుత్వం తరపున బాధితురాలికి న్యాయం చేయండి ఆయన సూచించారు. అనంతరం కిరణా కొట్టు యజమానిరాలు నాగలక్ష్మికి తెలుగుదేశం పార్టీ తరపున మీరు అన్ని విధాలుగా అండదండలుగా ఉంటూ మీరు నష్టపోయిన నష్ట పరిహారాన్ని ప్రభుత్వం ద్వారా చెల్లించే విధంగా చూస్తానని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమలతోపాటు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, లక్ష్మినారాయణ, కౌన్సిలర్‌లు నరసింహరాజు, మేఘన రమేష్, సత్యసాయి జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్, మున్సిపల్ కాంట్రాక్ట్ అక్కంపల్లి బాబు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనకు కలిసి కట్టుగా పోరాడుదాం

- ఆర్డిటి రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున

అగళి, జులై 5 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్

బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనకు అన్ని వర్గాల ప్రజలు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆర్డిటి రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున అన్నారు. ఇరిగేపల్లి ఉన్నత పాఠశాలలో ఆర్డిటి మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు అరికడదాం, ఆడ బిడ్డలను కాపాడుదామనే కార్యక్రమం నిర్వహించారు. టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముందుగా అమ్మాయిలకు లఘు చిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, లైంగిక వేదింపులు, బాల్య వివాహాలు అనే విషయాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మడకశిర ఆర్డిటి రీజనల్ డైరెక్టర్ మాట్లాడుతూ.. బాలల పట్ల వివక్ష చూపరాదని, బాల్య వివాహాలు, లైంగిక వేదింపులు ఎక్కువ అవుతున్నాయని వీటిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. బాలలను, వారికున్న హక్కులను జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యపు హక్కులను కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్డిటి సంస్థ ప్రతి మండలంలోనూ ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ కోసం ముందస్తు చర్యగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారని తెలిపారు. లైంగిక వేదింపులు, మంచి స్పర్శ, చెడు స్పర్శ వల్ల కలిగే అనర్థాలను లఘు చిత్రాల ద్వారా తల్లిదండ్రులకు, చిన్నారులకు అర్థం అయ్యే విధంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అమ్మాయిలు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయక బాగా చదివి ఉన్నత స్థానాలకు పోవాలని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లీలావతి మాట్లాడుతూ.. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక, శారిరక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు సుబ్బారావు, మాజీ సర్పంచు కళ్లప్ప, ప్రధానోపాధ్యాయులు రవీంద్రమూర్తి, హెడ్‌కానిస్టేబుల్ సూర్యప్రకాష్, ఆర్డిటి సిబ్బంది బ్రాహ్మణి, శివాజీ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళం ఇచ్చిన పింఛన్ దారులు

- ఎమ్మెల్యే పరిటాల సునీతకి అందజేసిన వైనం

రామగిరి, జులై 5 ప్రభాతవార్త

ఎమ్మెల్యే పరిటాల సునీతకు విరాళం అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రాని కి గర్వించదగ్గ రాజధాని ఉండాలన్న ఆశలతో పేదలు కూడా తమ వంతు సాయం అందిస్తున్నారు. నెలనెలా పింఛన్ తీసుకునే వృద్ధులు సైతం తమకు ఇచ్చిన దాండట్లో కొంత రాజధానికి విరాళంగా ఇస్తున్నారు. తాజాగా రామగిరి మండలం కొత్తగాదిగకుంట గ్రామానికి చెందిన పింఛన్ దారులు 64 వేల రూపాయలు ఇచ్చారు. వారికి వచ్చే పింఛన్ నుంచి 64వేల రూపాయల సేకరించి, విరాళంగా మాజీ మంత్రి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు అందజేశారు. తమకు వచ్చే పింఛన్‌లో కొంత మొత్తం తగ్గినా పర్వాలేదు కానీ.. భావితరాల కోసం రాజధాని ఉండాలన్న భావనతో తాము పింఛన్ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా పరిటాల సునీత వారిని అభినందించారు. 2019లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఉంటే.. ఇప్పటికే మనకు రాజధాని నిర్మాణం పూర్తి అయి ఉండేదన్నారు. కానీ జగన్‌రెడ్డి అరాచకం వలన రాష్ట్ర ప్రజలకు మన రాజధాని ఇది అని చెప్పుకునే పరిస్థితి లేకుండా చేశారు. కానీ ఇప్పుడు చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారని, కచ్చితంగా మన కలల రాజధాని నిర్మాణం పూర్తవుతుందన్నారు. పేద వారు, పింఛన్ దారులు కూడా ఇలా విరాళాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన

గుడిబండ, జులై 5 ప్రభాతవార్త

మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ సౌకర్యం లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుడిబండ మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడి త్వరితగతిన గుడిబండలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాట్లు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లాయర్ శివకుమార్, జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్, మాజీ ఎంపిటిసిలు భోజరాలు, కిష్టప్ప, తెదేపా నాయకులు శ్రీరామప్ప, వెంకటరమణ, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షణ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం రూరల్, జులై 5 ప్రభాతవార్త

డిపో మేనేజర్ సత్యనారాయణ

ఏపిఎస్ ఆర్టిసి వారు గ్రామీణ ప్రాంత వాసులకు శుభవార్త అందిస్తోంది. తమిళనాడు రాష్ట్రంలో తిరువణ్ణామలైలో వెలసి ఉన్న అరుణాచలేశ్వరుని పౌర్ణమి సమయంలో శివ భక్తులు గిరి ప్రదక్షిణ చేసుకోవడానికి ఏపిఎస్ఆర్‌టిసి వారు సదా అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ అవకాశాన్ని భక్తుల సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదికు ఉదయం 6 గంటలకు ధర్మవరం నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు బయల్దేరి 21తారీఖున కాణిపాకం గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచల గిరి ప్రదక్షణ దర్శనార్థం ఉంటుందని ఆయన తెలిపారు. ఒక మనిషికి రాను ఫోన్ చార్జీ 1400 రూపాయలు మాత్రమేనని అరుణాచల గిరి ప్రదక్షిణ చేసుకొని భక్తాదులు ఆర్టిసి బస్టాండ్‌లో రిజర్వేషన్ కౌంటర్ సదుపాయం కల్పించామని గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తాదులు సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 6303151302, 9959225859, నెంబర్లు సంప్రదించవచ్చునని ఆయన తెలియజేశారు.

టిడిపి పార్టీతోనే అభివృద్ధి సాధ్యం..!

- 7న జాబ్ మేళకు యువతీ యువకులు తరలి రండి

మడకశిర టౌన్, జులై 5 ప్రభాతవార్త

తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అసెంబ్లీ అధ్యక్షులు నాగరాజు

మడకశిర యాదవ కళ్యాణ మండపంలో ఈ నెల 7న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, మడకశిర నియోజకవర్గ శాసనసభ్యులు ఎంఎస్.రాజు ఆధ్వర్యంలో చేపట్టే గార్మెంట్స్ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అసెంబ్లీ అధ్యక్షులు నాగరాజు కోరారు. ఈ సందర్భంగా తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అసెంబ్లీ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేత ప్రారంభమయ్యే ఈ జాబ్ మేళా మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగుతుందని వివరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మడకశిర మేనిఫెస్టోను అమలు చేసే క్రమంలో స్థానికంగా ఉపాధి కల్పించి మడకశిర నియోజకవర్గం నుంచి వలస పోయిన వేలాది కుటుంబాలను తిరిగి స్వగ్రామాలకు రప్పించాలని ఉద్దేశ్యంతో జాబ్ మేళాను ఏ ర్పాటు చేయడమైంది అన్నారు. మడకశిర నియోజకవర్గ సరిహద్దు కర్ణాటక ప్రాంత వాసులు కూడా ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు అన్నారు. గార్మెంట్ పరిశ్రమలో పని చేసిన అనుభవం లేకపోయినా వారికి కూడా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు.

కొల్హాపురి మహాలక్ష్మి పూజలు

అగళి, జులై 5 ప్రభాతవార్త

రత్నగిరిలో వెలిసిన కొల్హాపురి మహాలక్ష్మి దేవతకు అగళి మారెమ్మదేవతకు శుక్రవారం రోజు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అయావాస్య కావడంతో దేవి మూల విరాట్‌లను వివిధ రకాల పూలతో విద్యుత్ దీపాలతో అలంకరించారు. మరీ ముఖ్యంగా దేవికి గన్నేరుపూలు ఎంతో ఇష్టం కాబట్టి, వాటితో అలంకరించడంతోపాటు, మ హిళలు హారతులను తయారు చేసి గన్నేరుపూలతో దేవికి పూజలు నిర్వహించారు. మహా మంగళ హారతి అనంతరం ఆలయ మండలి వారు భక్తులకు ప్రత్యేకంగా అన్నప్రసాదం పంపిణీ చేశారు.

గ్రామాల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమం

చెన్నేకొత్తపల్లి, జులై 5 ప్రభాతవార్త

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని ముష్టికోవెల గ్రామంలో టింబక్టు, కలెక్టివ్ సంస్థ సహకారంతో ఆదిశక్తి సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిశక్తి మహిళా సొసైటీ సభ్యులు, గ్రామంలోని మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆదిశక్తి సొసైటీ అధ్యక్షురాలు, కె.అశ్వర్థమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశక్తి సొసైటీ కార్యనిర్వహణ అధికారి, ఇ.కవిత మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళలపై జరుగుతున్న గృహహింస, తాగుడు బాల్య వివాహాలపై వారికి అవగాహన కల్పించారు. అలాగే వీటి మీద సొసైటీ సిబ్బంది నాటక రూపంలో ప్రదర్శించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గౌరీ, పావని, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధుల నిర్వహణ

గుత్తి, జూలై 5 ప్రభాతవార్త

పదవీవిరమణ ఉద్యోగిని సత్కరిస్తున్న దృశ్యం

గుత్తి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా అంకితభావంతో విధులు నిర్వహించిన రంగయ్య సేవలు అభినందనీయమని చైర్‌పర్సన్ వన్నూర్ బీ, కమీషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. రంగయ్య ఇటీవల స్వచ్ఛంధంగా పదవీవిరమణ గావించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వరలక్ష్మియాదవ్, కౌన్సిలర్లు ఫారుక్, మైనుద్దిన్, గురుప్రసాద్‌యాదవ్, మేనేజర్ మురళీధర్, వెంకటరెడ్డి, మహబూబ్‌జాన్, ఇమాంహుసేన్, షెక్షావలి, రామాంజినేయులు, పల్లవి, పర్వీన్, కొత్తరాజు, శేఖర్, బిల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళ్యాణ్‌రామ్ జన్మదిన వేడుకలు

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త

కళ్యాణ్‌రామ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ప్రముఖ సినీ హీరో నందమూరి కళ్యాణ్‌రామ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఉరవకొండ పట్టణంలో ఘనంగా జరిగాయి. ఆయన అభిమానులు జన్మదిన కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు మహేష్, అనీల్, వీరాంజినేయులు, సురేష్, నవీన్, అరవింద్, మని తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గుత్తి విద్యార్థి ఎంపిక

గుత్తి, జూలై 5 ప్రభాతవార్త

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

పట్టణంలోని కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తిరుమల అనే విద్యార్థి జాతీయ స్థాయిలో జరగనున్న బారా అట్లాటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. స్థానికంగా 10వ తరగతి చదువుతున్న ఇతను ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 16న బెంగుళూరులో జరగనన్న జాతీయస్థాయి పోటీల్లో షాట్‌పుట్, డిస్కస్‌త్రో, షావోలిన్ విభాగాలకు ఎంపికయ్యాడు. దీంతో శుక్రవారం అతనిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబహాన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సదరు విద్యార్థి జాతీయస్థాయిలో రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి డివిజన్ డివైఇఒగా బాధ్యతలు చేపట్టిన వి.నాగరాజు

గుత్తి, జూలై 5 ప్రభాతవార్త

బాధ్యతలు చేపట్టిన డివైఇఒ వి.నాగరాజును సన్మానించిన దృశ్యం

గుత్తి డివిజన్ డివైఇఒగా వి.నాగరాజు శుక్రవారం గుత్తి ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బాలికల పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూలు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించి శిక్షకులకు తగిన సూచనలు అందించారు. బాధ్యతలు చేపట్టిన డివైఇఒ వి.నాగరాజుకు గుత్తి బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి స్వాగతం పలుకుతూ ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆయనను సన్మానించారు. అనంతరం కోట పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబాన్, సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివైఇఒ నాగరాజు ఆధ్వర్యంలో విద్యారంగం మంచి అభివృద్ధి దశలో పయనించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉపాధి హామీపై మండలస్థాయి ప్రజావేదిక

- రూ.37 వేలు రికవరీకి ఆదేశం

అమరాపురం, జూలై 5 ప్రభాతవార్త

ప్రజావేదిక నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకంపై 18వ సామాజిక తనిఖీ ప్రజావేదికను జిల్లా స్థాయి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడి విజయప్రసాద్‌రెడ్డి, ఏపిడి లక్ష్మినారాయణ, విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఎంపిడిఒ భాస్కర్, ఎంపిపి ఈరన్న, వైస్ఎంపిపి కృష్ణమూర్తి, జెడ్‌పిటిసి స్వారక్క, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పిడి మాట్లాడుతూ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 589 పనులకు గాను 5.49 కోట్ల రూపాయలను వెచ్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 11 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి పనులను పరిశీలించారు. ఇందులో వివిధ పనుల్లో జరిగిన అవకతవకల ద్వారా 37,550 రూపాయలను రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా మండలంలో బసవనపల్లి, అగ్రహారం, అమరాపురం, శివరం, హలుకూరు గ్రామ పంచాయతీల్లో మృతి చెందిన వారికి కూడా ఫించన్లు అందచేసినట్లు సామాజిక తనికీలు వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా బసవనపల్లి గ్రామ పంచాయతీలో అంగన్‌వాడి టీచర్, ఆయా, ఆశావర్కర్ అగ్రహారం పంచాయతీలో అంగన్‌వాడి టీచర్, ఆశావర్కర్, హలుకూరు ఆయా ప్రభుత్వం అందిస్తున్న ఫించన్లను తీసుకుంటున్నట్లు గ్రామంలో పర్యటించిన సామాజిక తనిఖీ బృందం వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. సంబంధిత ఫించన్లను రద్దు చేయడానికి సిఫారస్ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మండల పరిధిలోని మద్దనకుంట ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు ఆ గ్రామంలో రైతులకు మల్బరీ పెడ్లను ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయించడంతో పాటు గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే ఇంకుడు గుంతలను కూలీల ద్వారా చేయించడం ద్వారా తమ బోర్లు ద్వారా నీరు సమృద్ధిగా వస్తున్నట్లు రైతులు పేర్కొన్నారని ఉపాధి తనిఖీ బృందం తెలియచేయడంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను జిల్లా స్థాయి అధికారులు సభలో అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఏపిఒ జగదీష్, జెఇ జగదీష్, సర్పంచు జితేంద్ర, ఎంపిటిసి ఓంకార్‌స్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు హెన్రీ అరుణ్‌కుమార్, బిఎఫ్‌టి హనుమంతరాయ, తిరుమలగౌడ్, లావణ్య, స్వాతి, గంగప్ప, మంజునాథ్, తదితరులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు రాహిత్, జయరంగప్ప, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్‌లోవున్న 8 వారాల ఉపాధిహామీ వేతనాలు చెల్లించండి

-ఎంపీడీఓకు విన్నవించిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

ఉరవకొండ, జూలై 5 ప్రభాతవార్త

ఎంపీడీఓ జి.వి.సుబ్బరాజుకు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పెండింగ్‌లోవున్న 8 వారాల ఉపాధిహామీ వేతనాలను చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.వి.సుబ్బరాజుకు వ్య.కా.సం జిల్లా ప్రధాన కార్యదర్శి యం.క్రిష్ణమూర్తి, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్, నాయకులు బి.మురళి, బి.రవికుమార్, వి.రామాంజినేయులు, యం.వి.కుమార్, చాపల లాలెప్ప వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా ప్రధాన కార్యదర్శి యం.క్రిష్ణమూర్తి మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టం ద్వారా జిల్లాలో 2.25 లక్షల మంది కూలీలు పనులు చేసుకొంటూ జీవిస్తుండగా రాజకీయ కారణాలతో ప్రస్తుతం 25వేల కూలీలకు తగ్గిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సమ్మర్ అలవెన్స్ ఎత్తివేయడం, రెండు పూటల పని, ఆన్‌లైన్ మస్టర్ చేసిన పనులకు వేతనాలు చెల్లించకుండా నెలల తరబడి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఉపాధి కూలీ కుటుంబ సభ్యులందరికీ బీమా సౌకర్యం కల్పించాలని, అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించి రాజకీయ జోక్యం ఆపాలన్నారు. 200 రోజుల్లో పనులకు రోజుకు 600 రూపాయలు కూలీ ఇవ్వాలని, 100 రోజులు పనులు పూర్తీ చేసిన కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 100 రోజులు ఉపాధి పనులు కల్పించాలనా న్నారు. చేసిన పనులకు వారం వారం వేతనాలు చెల్లించాలని, ఉపాధిహామీ మేట్లకు పారితోషకం చెల్లించాలని, పనిముట్లు, సమ్మర్ అలవెన్సు, అదనపు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని, ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌లో 2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కెంకెరలో పర్యటించిన జిల్లా స్థాయి అధికారులు

- తక్షణం వైద్యశిబిరం ప్రారంభం
- వార్త కథనానికి స్పందించిన అధికారులు

అమరాపురం, జూలై 5 ప్రభాతవార్త

వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని హేమావతి గ్రామ పంచాయతీ కెంకెర గ్రామంలో వాంతులు, విరేచనాలు విజృంభణ ఒక వ్యక్తి మృతి అని వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఆ గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో వాడవాడలా పర్యటించి వాంతులు, విరేచనాలకు గురైన వ్యక్తుల ఇళ్లను పరిశీలించారు. అదేవిధంగా జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ బృందం కూడా పరిశీలించి నాగభూషణం అనే వ్యక్తి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి మంజువాణి, జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మనోనాయక్, డిఎల్‌పిఒ శివనారాయణ, తహశీల్దార్ వెంకటసుబ్బయ్య, ఇఒఆర్‌డి నాగమణి, హేమావతి పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ భార్గవ్, డాక్టర్ జయకుమార్, డాక్టర్ మాధవిలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుని భార్య నాలుగు నెలల గర్భవతి కావడంతో ఆమెకు తగిన వైద్య సేవలు అందించడంతో పాటు మానసిక ఒత్తిడికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఆశాకార్యకర్తలకు జిల్లా వైద్యాధికారి సూచించారు. అదేవిధంగా ఎస్‌సి కాలనీలో తాగునీటి కొళాయిలకు క్యాప్‌లు లేకుండా నీరు సరఫరా అవుతుండడంతో పాటు డ్రైనేజి వ్యవస్థ లేకుండా మురికిమయంగా వుండడంతో మడకశిర ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మనోనాయక్ స్పందించి ఎలాంటి మురికి లేకుండా కొళాయిలకు క్యాప్‌లు వేయాలని సూచించడంతో పాటు వ్యర్థ నీరు బయట ప్రాంతానికి వెళ్లడానికి జెసిబి ద్వారా ప్రత్యేక కాలువ ఏర్పాటు చేయడానికి పనులను సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రత్యూష, గ్రామ కార్యదర్శి నరేష్‌బాబు, గ్రామ సర్పంచు తిప్పేస్వామిలకు ఆదేశించారు. అదేవిధంగా వైద్యాధికారులు ప్రత్యేక వైద్యశిబిరాన్ని వారం రోజుల పాటు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. ప్రస్తుతం గ

బహుముఖ ప్రజ్ఞశాలి రావూరి భరద్వాజ

అనంతపురం, జులై 5 ప్రభాతవార్త బ్యూరో

నిరుపేద కుటుంబంలో పుట్టి దేశ అత్యున్నత సాహితీ పురస్కారం పొందిన గొప్ప సాహితీ వేత్తని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్ రావూరి భరద్వాజ జయంతి సందర్భంగా స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్, జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యాలయంలో రావూరి భరద్వాజ చిత్రపటానికి పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. ప్రముఖ తెలుగు నవలా రచయిత, కథా రచయిత, కవి, విమర్శకుడు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, రావూరి భరద్వాజ బహుముఖ ప్రజ్ఞాశాలి, శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ నానీల నాగేంద్ర ప్రసంగిస్తూ.. తన జీవిత కాలంలో 37 కథా సంకలనాలు 17 నవలలు ఆరు బాలల నవలలు 8 నాటకాలు రాసిన బహుముఖ ప్రజ్ఞాశాలి రావూరి భరద్వాజా అని ప్రసంగించారు. అశ్వద్దరెడ్డి మాట్లాడుతూ .. పాకుడు రాళ్లు జీవన సంబరం మొదలైన నవలలు ఆయనకు కీర్తిని తెచ్చాయన్నారు.

ఆయన సాహిత్య ప్రావీణ్యానికి ఆంధ్ర యూనివర్సిటీ నాగార్జున యూనివర్సిటీ జెఎస్‌టియు విశ్వవిద్యాలయం మొదలైనవి గౌవ డాక్టరేట్‌తో ఆయనను సత్క రించాయి అనికొనియాడారు. చలనచిత్ర పరిశ్ర మను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్టమొదటి నవల పాకు డు రాళ్ల అని వకలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జాషు వా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్. నాగ లింగయ్య (దళితపులి) అనంత సాహితీ ప్రస్థానం వ్యస్థాపక అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, బండి వసంతకుమార్, విశాలాంధ్ర బుక్ హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, సియన్ శ్రీనివాసులు, సాయి తదితరులు పాల్గొన్నారు.

రావూరి భరద్వాజ చిత్రప టానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

అనంతపురం నగరంలో విద్యార్థులు ఏఐఎస్ఎఫ్‌లో చేరిక
- ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బి.రమణ

అనంతపురం న్యూటౌన్, జులై 5 ప్రభాతవార్త

ఏఐఎస్ఎఫ్ అనంతపురం నగర సమితి ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో విస్తృత సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్ అధ్యక్షతన వహించ డం జరిగింది. ముఖ్య అతిథు లుగా ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బి.రమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు రమణయ్య, కుళ్లాయిస్వామి, నగర కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు రమణా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు రమణయ్య, కుళ్లాయిస్వామి, దేశ స్వాతంత్ర్యం పోరాటంలో పాల్గొన్న మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులతోపాటు ఉపాధ్యక్షులు వంశీ నగర నాయకులు హర్ష, ఆనంద్, రారాజు, పవన్, ప్రసన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

7న వాల్మీకి ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సత్కారం

మాట్లాడుతున్న వాల్మీకి సోదరులు

అనంతపురం న్యూటౌన్, జులై 5 ప్రభాతవార్త

ఈ నెల 7వ తేదిన వాల్మీకి ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సన్మాన సభను నిర్వహిస్తున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు బండమీద గంగాధర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేది ఆదివారం ఉదయం 10 గంటలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో వాల్మీకి జాతికి సంబంధించి గెలుపొందిన శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులతో పాటు శాసన మండలి సభ్యులకు జిల్లా పరిషత్ చైర్మన్‌లకు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి కిషోర్, నాయకులు భాస్కర్‌నాయుడు, రమణ, సత్యనారాయణ, కృష్ణమూర్తి, సూర్య నారాయణ, వెంకటేషులు, నరసింహులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమశాఖ మంత్రి సవితను కలిసిన దండు శ్రీనివాసులు

శింగనమల, జులై 5 ప్రభాతవార్త

రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి సవితను శుక్రవారం పెనుకొండలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, టిఎన్ఎస్ఎఫ్ బండి పరుశురామ్, బిసి సెల్ బెస్త నారాయణ స్వామి, ప్రసాద్‌నాయక్, దండు ప్రకాష్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితకు పూలె బొకేను అందిస్తున్న దండు శ్రీనివాసులు

డయేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన
- మండల వైద్యాధికారి శంకర్‌నాయక్

నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న ఆశావర్కర్లు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

శింగనమల, జులై 5 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా డ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల వైద్యాధికారి శంకర్ ఆధ్వర్యంలో ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ.. డయేరియా వ్యాధి లక్షణాలు, చికిత్స తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డా.తేజశ్విని, సిహెచ్ఓ గంగాధర్, సూపర్‌వైజర్ అశ్వర్థ, నాగప్ప, హెల్త్ ప్రొవైడర్స్, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జి.చంద్రశేఖర్ మృత్తి అసోసియేషన్‌కు తీరని లోటు
జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు.

అనంతపురం రూరల్. జూలై05 ప్రభాతవార్త:

జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఆర్‌జి. చంద్రశేఖర్ మృత్తి అసోసియేషన్‌కు తీరని లోటని జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియే షన్ అధ్యక్షులు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు మాట్లాడుతూ ఆర్‌జి.చంద్రశేఖర్ అసోసియేషన్ సంక్షే మం,అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం జరిగిందని అలాంటీ వ్యక్తి మృతి చెందడాన్ని జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో పాటు ఉమ్మడీ అనంత జిల్లాలోని పాస్టర్స్ అందరూ జీర్ణించుకోలేకపో తున్నారన్నారు. శుక్రవారం ఉపాధ్యాక్షులు మార్క్,ట్రెజరర్ జీవన్,సభ్యులు జాషువా జహంగీర్,రూపాస్ కుమార్, శాంతవర్దన్,లాభన్,వైపి. బాబు, జేమ్స్ పాల్ నాయక్,యేసుకృపా మందిరం పాస్టర్ నవీన్‌కుమార్‌తో పాటు అనేక మంది పాస్టర్స్‌తో కలసి చంద్రశేఖర్ బౌతిక కాయానికి నీవాళ్ళుల ర్పిం చి కుటుంబ సభ్య లనెఉ పరామరి ్శంచారు,

ఆర్‌జి చంద్రశేఖర్ భౌతిక కాయానికి నివాళ్ళుర్పిస్తున్న పాస్టర్స్

గంగవరం పాఠశలను విలీనం నుంచి మినహాయించాలి
- ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్

అనంతపురం న్యూటౌన్, జులై 5 ప్రభాతవార్త

బెలుగుప్ప మండలం, గంగవరం ప్రాథమిక పాఠశాలను విలీనం నుంచి శాశ్వతంగా మినహాంయించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలీనం అయిన గంగవరం పాఠశాలను సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. జీవో నెంబర్ 117 మేరకు గతంలో గంగవరం ప్రాథమిక పాఠశాల లోని 3, 4, 5 తరగతులను స్థానిక ఉన్నత పాఠశాలలో విలీనం చేశారని, కానీ ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి 3, 4, 5 తరగతులలో చదివే 50 మంది విద్యార్థులను తల్లిదండ్రులు ఉన్నత పాఠశాలలకు పంపడం లేదని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి తల్లిదండ్రులు పోరాటం చేస్తుంటే అధికారులు అలసత్వం ప్రదర్శించడం సరైంది కాదని విమర్శించారు.

విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

108 సిబ్బంది సమస్యలపై విచారణ

అనంతపురం, జులై 5, ప్రభాతవార్త ప్రతినిధి

అనంతపురం జిల్లాలోని 108 సిబ్బంది సమస్యలపై రాష్ట్ర స్థాయి హెచ్ఆర్ కె.బ్రహ్మం, జెడ్ఎం పి.శివరాకేష్‌లు విచారణ చేపట్టారు. ఈ మధ్యకాలంలో అనంతపురం జిల్లాలోని 108 సిబ్బంది నుంచి అనేక ఆరోపణలు వచ్చాయి. వాటిపై శుక్రవారం రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన బ్రహ్మం, శివరాకేష్‌లు విచారణ చేపట్టారు. జిల్లాలోని పలు వాహనాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం 108 కార్యాలయంలో జిల్లా వెల్ఫేర్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న వాస్తవాలను తెలుసుకుని ఆ వివరాలను రాష్ట్ర కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయపరమైన నిర్ణయాలను తీసుకుని న్యాయం చేస్తామని తెలిపారు.

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బ్రహ్మం

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుచేసుకోండి..ఎంపీపి

బుక్కరాయసముద్రం, జూలై 5 ప్రభాతవార్త

రైతులు ఉపాధి హామీ పథకం కింద ఎఫ్‌వై 2024=25 ఆర్థిక సంవత్సరంలో పండ్ల తోటల పెంపకం చేపట్టుటకు కుటుంబానికి 5 ఎకరాలలోపు ఉన్న సన్న చిన్నకారు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీపీ దాసరి సునీత తెలిపారు. శుక్రవారం బుక్కరాయసముద్రం మండల పరిదిలోని శిద్దరాంపురం గ్రామంలో 2021=22లో చేపట్టిన నారాయణరెడ్డి రైతు పొలం,2022=23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన మద్దిలేటి రైతు పొలంలో చేపట్టిన చీని తోటలను ఎంపీపీ సునీత,ఎంపీడీఓ శోభారాణి, ఈఓఆర్డి దామోదరమ్మ పర్యవేక్షించడం జరిగింది.మండలంలోని 19 గ్రామ పంచాయితీల రైతులు ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుచేసుకోవాలన్నారు.పూర్తి వివరాల కొరకు సంబందిత ఎంపీడీఓ కార్యలయం అదికారులను కలవాలన్నారు.

పండ్ల తోటలను పరిశీలిస్తున్న ఎంపీపీ సునీత

నూతన ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలి -ఎస్‌టియు నేతలు

అనంతపురం న్యూటౌన్, జులై 5 ప్రభాతవార్త

ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం అయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని అనంతపురం ఎస్టఇయు కార్యాలయంలో ముఖ్యుల సమావేశం సందర్భంగా ఎస్టియూ అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి రామాం జినయులు కోరారు. కొత్త ప్రభుత్వం ఈ రాష్ట్రంలోని ఉద్యోగుల మనోభావాలకు అనుగుణంగా పని చేయానలి, 12వ పిఆర్‌సి అమలులో భాగంగా తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలని పాఠశాల విద్యలో 117 జీవో రద్దు చేయాలని, ఇంగ్లీష్ మీడి యంతోపాటు తెలుగు మాద్యమాన్ని కూడా ప్రభుత్వ పాఠశాలలో కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఫణి, భూషణ్ జిల్లా నాయకులు రాజశేఖర్, మురళీకృష్ణ, మల్లిఖార్జున, మండల నాయకులు రామకృష్ణయ్య,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఎస్‌టియు నేతలు

కంది పంటకు మద్దతు ధర అందించడానికి కృషి చేస్తాం
ఏడిఏ రవి,ఏఓ శశికళ,

అనంతపురం రూరల్, జూలై 05 ప్రభాతవార్త:

అనంత డివిజన్ పరిధీలోని రైతులందరికి రబీలో మంచి వంగడాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేసి కంది పంటకు మద్దతు ధర అందించడానికి కృషి చేస్తామని అనంత డివిజన్ సహాయ వ్యవసాయ సంచాల కులు రవి.ఏఓ శశికళ పిలుపునిచ్చారు. శుక్రవారం అనంత రూరల్ మండలం చియ్యేడులో రైతు లింగమయ్య వేరుశెనగ,కంది పంటలు వేయడంతో వాటీని వారు రైతులతో కలసి పరిశీలించి విత్తన శుద్ధి గురించి రైతులకు క్లుప్తంగా తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు గ్రామంలోని చాలామంది ఎక్కువ విస్తర్ణంలో కందిని సాగు చేయడం జరుగుతుందని కంది పంటకు మద్దతు ధర ఎక్కువగా ఇవ్వాలని అధికారులను కోరారు. తప్పకు ండా ఈ విషయమంను ప్రభుత్వం,పై అధికారుల దృష్టికి తీసుకపోతామని రైతులకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏడిఏ రవి మాట్లాడుతూ రైతులు అందరు సాగుకు సిద్ధం అయి తమకు ఉన్న విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ మురళీ కృష్ణ,ఆర్‌బీకే సిబ్బంది భువనేశ్వరీ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వేరుశెనగ,కంది పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నేడు, రేపు ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాష్ట్రస్థాయి శాస్త్రవేత్తల బృందం పర్యటన

అనంతపురం, జూన్ 5 ప్రభాతవార్త బ్యూరో

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శనివారం, ఆదివారం రోజుల్లో రెండు రోజులు పాటురాష్ట్రస్థాయి శాస్త్రవేత్తల బృందం పర్యటిస్తోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన పదిమంది గల బృందం తోటలను, నర్సరీలను పరిశీలి ంచి సూచనలు సలహాలు ఇవ్వనుంది. ఈ బృందం అనంతపురం జిల్లాలోని, శ్రీ సత్యసాయి జిల్లాలను పర్యటిస్తోందని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఫిరోజ్ ఖాన్, శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖ ర్ తెలియజేశారు.

ఈ బృందంలో వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు శాస్త్రవే త్తలు ఉన్నారు. డాక్టర్ వైఎస్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్ట ర్ రాజేశ్వర్ సింగ్, డిల్లీలోని ఐసిఏఆర్ మాది అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ వాస్కా సింగ్ దిల్లోన్, బెంగుళూరులోని ఐసిఏఆర్ సాయిల్ సైన్స్ మాజీ హెడ్ గణేష్ మూర్తి, న్యూ ఢిల్లీలోని ఏఎస్ఆర్‌బి మాజీ సభ్యుడు పీకే చక్రవర్తి, సోలాపూర్‌లోని ఐసిఏఆర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసం ్రామకృష్ణ పాల్, నాగపూర్‌చెందిన ప్రిన్సిపాల్ సంఐటిస్ట్ డాక్టర్ఏకె దాస్, అనంతపు రంలోని రేగులకుంట హార్టికల్చర్ పరిశోధన కేంద్రం ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, తిరుపతి, కడప ప్రాంతానికి చెందిన సీనియర్ సైంటి స్టులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కేటి వెంకటరమణ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. శాస్త్రవేత్తల బృందం రైతులకు మేలైన సూచనలు సలహాలు ఇవ్వనుంది.

మా భూమి మాకిప్పించండి
జిల్లా అధికారులు మాకు న్యాయం చేయాలి బాధితుడు రాఘవరెడ్డి

అనంతపురం రూరల్,జూలై05ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం వికలాంగుల కాలనీలో గల కక్కలపల్లి పొలం సర్వే నెంబర్ 99ఖై 1లో 7 ఎకరాల 12 సెంట్లు మా తాత ద్వారా మాకు సంక్రమించిన భూమిని కొంత మంది టిడిపి నాయకులు కబ్జా చేయాలని చూడడం జరుగుతుందని మా భూమిని మాకు ఇప్పించాలని బాధితుడు,మాజీ ఎంపిటిసి గుగ్గిళ్ల రాఘవరెడ్డి జిల్లా అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అనంత రూరల్ మండలం వికలాంగుల కాలనీలో గల కక్కలపల్లి పొలం సర్వే నెంబర్ 99ఖై 1లో 7 ఎకరాల 12 సెంట్లు మా తాత గుగ్గిళ్ల నాగిరెడ్డి,అవ్వ గుగ్గిళ్ల కామాక్షమ్మ పేరు మీద 1933 నుంచి 28 ఎకరాల పట్టా భూమి ఉందని అప్పటీ నుంచి ఆ స్థలంలో నేటీ వరకు మా ఆధీనంలో ఉందని ఆ భూమి లో 21.30 ఎకరాలు అమ్మకాలు జరపగా మిగిలిన 7 ఎకరాల.12 సెంట్ల భూమి తమ అధీనంలోనే ఉండన్నా రు. అయితే కొంత మంది స్థానిక టిడి పి నాయకులు అధికారులను అడ్డు పెట్టుకుని పట్టా భూమిని సాగు భూ మిగా ఆన్‌లైన్‌లో పొందుపరుకుని ఆ భూమి మాదే అంటు హద్దులు ఏర్పా టు చేసేందుకు రావడంతో తాము అడ్డుకోవడం జరిగిందని కాని ఇప్పుడే మా పోలీసులు,రెవిన్యూ అధికారులు మా భూమిలో దగ్గరుండి హ ద్దులు ఏర్పా టు చేయించడం జరు గుతుందని కావున కబ్జా దారుల నుం చి మా తాత నుంచి మాకు సంక్ర మించిన మా భూమిని మాకు ఇవ్వా లని ఆయన జిల్లా అధికారులను కోరారు.

మీడియాతో మాట్లాతుతున్న మాజీ ఎంపిటిసి రాఘవరెడ్డి.

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అనంతపురం నేతలు బేటి

అనంతపురం, జులై 5 ప్రభాతవార్త బ్యూరో

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డితో అనంతపురం టౌన్ బ్యాంకు మాజీ అధ్యక్షులు సి.వెంక టేషులు, శివశంకర్ మెడికల్ స్టోర్ యజమాని లక్ష్మయ్య తదితర వైసీపీ నాయకులు శుక్రవారం తాడేపల్లిలో కలిశారు. ప్రముఖ కావు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతో కలిసి వారు ప్రత్యేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో కలిశారు.

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో అనంతపురం వైకాపా నేతలు

మాజీ సిఎం జగన్‌ను కలసిన లబ్బే రాఘవ

అనంతపురం రూరల్, జూలై 05 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డిని అనంత జిల్లా ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యా క్షులు లబ్బే రాఘవ శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపుర్వకంగా కలసి ఆయన పుష్పగుచ్చాం అందజేసి శాలువతో సత్కరించి జిల్లాలో ఎస్సీ,ఎస్టీ, బిసి,మైనార్టీలు ఎదుర్కోంటున్న సమస్యలను ఆయనకు వివరించి ,మీ పాలనలో జిల్లాలో ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనార్టీలకు తగ్గిన న్యాయం జరిగిందన్నారు.

మాజీ సిఎం జగన్‌ను కలసిన లబ్బే రాఘవ.

అసత్య ప్రచారాలు చేయొద్దండి

అనంతపురం న్యూటౌన్, జులై 5 ప్రభాతవార్త

వాస్తవాలు తెలుసుకోకుండా తమ పాఠశాలపైన అసత్య ప్రచా రాలు చేయడం మంచి పద్ధతి కాదని మహాత్మ జ్యోతి పూలే రెసిడెన్షియల్ స్కూల్స్ జిల్లా కన్వీనర్ సంగీత కుమారి శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపా రు. తమ స్కూల్ పిల్లలం దరికీ ఎండా కాలం సెలవులలో చదువు మర్చిపోకుండా ఉండడా నికి ప్రతి ఒక్క విద్యార్థికి హోమ్ వర్క్ ఇవ్వడం జరిగిందన్నారు. దాదాపుగా అందరు విద్యార్థులు హోమ్ వర్క్ చేసుకుని రావడం జరిగింది. అతి తక్కువ మంది విద్యార్థులు హోం వర్క్ చేసుకుని రాని వారికి ఇంటికి పంపి హోం వర్క్ చేసుకుని రండి అని చెప్పడం జరిగిం దన్నారు. పిల్లలపై ఎలాంటి క్రమశిక్షణలో గాని కొట్టడంగాని జరగలేదన్నారు. పిల్లలు కూడా ఇంటికి వెళ్లి హోం వర్క్ చేసుకునిరావడం జరిగింది. అలాగే పదవ తరగతి అమ్మాయిని కూడా టీచర్ల అందరి సమక్షంలో ఆ అమ్మాయికి నచ్చచెప్పి హోం వర్క్ చేసుకురమ్మని క్లాస్ టీచర్ ఇంటికి పంపడం జరిగిందన్నారు. ఇలా మేము స్కూల్‌ను అన్ని విషయాల్లో ముందుకు తీసుకు వెళ్తుంటే కొందరు కావాలని స్కూల్‌ను డామేజ్ చేయడం జరుగుతుందన్నారు. ఇంకోసారి ఇలాంటి అసత్యప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

యాడికిలో డెంగ్యూ వ్యతిరేక దినోత్సవం

యాడికి, జూలై 5 ప్రభాతవార్త

మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు డెంగ్యూ, అతిసార వ్యాధి నివారణ గురించి వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం, అతిసారవ్యాధిపై పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తహశీల్దార్ కార్యాలయం, చింతవనం ఆంజనేయస్వామి దేవాల యం మీదుగా వైఎస్ఆర్ సర్కిల్, గాంధీసర్కిల్‌కు చేరుకుంది. అనంతరం విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి డెంగ్యూ, మలేరియా, అతిసారా వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సావిత్రి, ఇఒఆర్‌డి వెంకటేశ్వర్లు, ఎంఇఒ కాశెప్ప, హైస్కూల్ ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ బాలయ్య, డాక్టర్ శ్రీరామ్‌కుమార్, సిహెచ్ఒ జుబేదా, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సబ్మిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

డయేరియాపై అవగాహన

యల్లనూరు, జూలై 5 ప్రభాతవార్త

మండలంలోని పెద్దమల్లేపల్లి గ్రామ సచివాలయంలో వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుమలాపురం సర్పంచు రామాంజులరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హెల్త్ సిబ్బంది మాట్లాడు తూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. చుట్టుపక్కల నీరు నిల్వ వుండకుండా చూసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే అవకాశం వుందన్నారు. భోజనం చేయడానికి ముందు, మలవిసర్జనకు వెళ్లివచ్చిన తరువాత సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. పిల్లల పట్ల జాగ్రత్తగా వుండాలని తెలియచేశారు. అనంతరం డయేరియాకు సంబంధించిన పోస్టర్లను సర్పంచు రామాంజులరెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పి గౌతమి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచు రామాంజులరెడ్డి

రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు - ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అమడగూరు, జూలై 5 ప్రభాతవార్త

మండలంలోని బలకవారిపల్లి గ్రామం నుండి సోలుకుంట వయా కంచనగారిపల్లి, చెర్లో పల్లి మీదుగా కదిరికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగిఎోవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఏపుగా పెరిగిన ముళ్లపొదల కారణంగా రహదారి సరిగా కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన బత్తిని రఘునాథరెడ్డి, తదితరులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలకవారిపల్లి నుండి కంచనగారిపల్లికి వెళ్లే ఈ ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగి రహదారిపైకి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు ఇరువైపులా వున్న ముళ్లపొదలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.